క్లుప్తంగా

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి


నవదుర్గ పీఠక్షేత్ర ఆలయ భూమిపూజ

జగిత్యాలటౌన్: నవదుర్గ పీఠక్షేత్రం ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పిలుపునిచ్చారు. జగిత్యాల పట్టణం గోవిందుపల్లిలో నిర్మిస్తున్న నవదుర్గ పీఠక్షేత్రం ఆలయ నిర్మాణానికి ఆదివారం బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి భూమిపూజలో పాల్గొని ముత్యం, పగడం, రాగి నాణం వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భక్తులు ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, నవదుర్గా సేవాసమితి ట్రస్ట్ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రూప్ -3 అభ్యర్థుల కోసం సహాయ కేంద్రాలు


అభ్యర్థికి సమాచారం ఇస్తున్న పోలీస్

కోరుట్ల: పట్టణంలో గ్రూప్ 3 పరీక్ష రాస్తున్న అభ్యర్థుల కోసం కోరుట్ల పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం పలు ప్రాంతాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని బస్టాండ్, నంది చౌరస్తా వద్ద సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలకు వెళ్లే అడ్రస్‌లు, చేరుకునేందుకు సూచనలు చేశారు. పలు పాఠశాలల ఎన్‌సీసీ కెడెట్స్ ఈ హెల్ప్ డెస్క్‌లో భాగం పంచుకున్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు మేలు


చెక్కును అందిస్తున్న సుజిత్‌రావు

మెట్‌పల్లి: ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతోందని పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. నియోజకవర్గానికి చెందిన ఆరుగురికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్దన్‌తో పాటు నాయకులు ఖుత్బొద్దీ, రుత్త నారాయణ, గద్దల భరత్, మొగిలి రాజేందర్, అమ్ముల పవన్, మాజీద్, సమీర్ పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చితే భూసారం క్షీణత


వరి కొయ్యలను కాల్చుతున్న రైతులు

మెట్‌పల్లిరూరల్: రైతులు వరి కొయ్యలను కాల్చొద్దని మెట్‌పల్లి మండల వ్యవసాయాధికారి దీపిక తెలిపారు. యాసంగి సాగుకు సిద్ధమవుతున్న రైతులు వరికొయ్యలకు నిప్పు పెట్టి కాల్చుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొయ్యలను కాల్చితే విపరీతమైన వేడితో భూమి సారం కోల్పోతుందన్నారు. కొయ్యలకు నిప్పు పెట్టకుండా,వాటిపై సూపర్ పాస్ఫెట్ చల్లితే 15 రోజుల్లో కొయ్య మురిగిపోవడంతో పాటు పోషకాలు అందుతాయన్నారు.డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుందన్న ఏవో,ఏమైనా వ్యవసాయపరమైన సమస్యలు,సలహాలకు వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

వరి పంట అవశేషాలు కాల్చవద్దు

వెల్గటూర్ : వరి పంట కోసిన తర్వాత వాటి అవశేషాలు కాల్చవద్దని మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ అన్నారు. పంట అవశేషాలు కాల్చడం వల్ల పర్యావరణానికి హాని కలిగి, కాలుష్యం పెరుగుతుందని అన్నారు. కాలుష్యంతో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అవశేషాలు కాల్చడం వల్ల భూమిలో ఉండే పంటకు ఉపయోగపడే బ్యాక్టీరియా, సూక్ష్మజీవులు చనిపోయి చీడపీడల సమస్య ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి రైతులు పంట అవశేషాలు కాల్చకుండా పర్యావరణాన్ని కాపాడాలని ఏవో రైతులకు విజ్ఞప్తి చేశారు.

గ్రామ సంతల షెడ్లు ఏర్పాటెప్పుడో?

- నాలుగు గ్రామాల్లో స్థలాలు పరిశీలన
- ఆర్భాటం చేసిన అధికారులు
- 10 నెలలు గడిచిన పురోగతి కరువు


కథలాపూర్‌లో రోడ్డు పక్కన కూరగాయల విక్రయం

కథలాపూర్: గ్రామాల్లో వారానికోసారి నిర్వహించే వారసంతల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన ఇరుకు ప్రదేశాల్లో విక్రయాలు జరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలు తీర్చేందుకు పలు గ్రామాల్లో సంతల కోసం షెడ్లను నిర్మించాలని స్థలాలను 10 నెలల క్రితం ఎంపిక చేశారు. వీటి నిర్మాణాల కోసం గ్రామపంచాయతీల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో నిధులు మంజూరు చేస్తుందని అధికారులు ప్రకటించారు. ఇదీ గడిచి 10 నెలలు గడిచినా పురోగతి లేకపోవడంతో గ్రామ సంతల్లో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇక్కట్లపాలవుతున్నారు.

మండలంలో నాలుగు గ్రామాలు ఎంపిక

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. ఈ సంతల నిర్వహణలో వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు ఉండవద్దని కాంప్లెక్స్ షెడ్ల నిర్మాణాలు, స్టోర్ రూం, మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలని ఉపాధిహామీ ప్రణాళిక రూపొందించారు. మొదటగా మండలంలోని గంభీర్‌పూర్, తాండ్ర్యాల, కథలాపూర్, చింతకుంట గ్రామాల్లో ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో వీటిని నిర్మించేందుకు ఈ ఏడాది జనవరి నెలలో అధికారులు స్థలాలు


కథలాపూర్ శివారులో షెడ్లు నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్న మండలాధికారులు (ఫైల్)

సైతం పరిశీలించారు. ఇప్పటికీ మోక్షం లేకపోవడంతో పాలకుల తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల ప్రతిపాదనలు ఇలా..

కేటగిరీ–1 కింద నిర్మించే సంతలకు 30 దుకాణాల షెడ్లకు గాను రూ. 15 లక్షలు. కేటగిరీ–2లో నిర్మించే 20 షెడ్ల దుకాణాలకు రూ. 12.50 లక్షలు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. మండలంలోని గంభీర్‌పూర్, కథలాపూర్ గ్రామాల్లో ఉన్న స్థలాలను బట్టి 30 దుకాణాల షెడ్లు, తాండ్ర్యాల, చింతకుంట గ్రామాల్లో అందుబాటులో ఉన్న స్థలాలను బట్టి 20 దుకాణాల షెడ్లు నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఆ తర్వాత పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి షెడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

షెడ్లు త్వరగా నిర్మించాలి



కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు ప్రతీరోజు ప్రతీ కుటుంబానికి అవసరం. అందుకు తగ్గట్టుగా సంతల్లో సౌకర్యాలు కల్పించాలి. ఎంపిక చేసిన గ్రామాల్లో సంతల కోసం కాంప్లెక్స్ షెడ్లు నిర్మించాలి. అప్పుడే ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి కూరగాయలు, ఇతర వస్తువులు తీసుకెళ్లి విక్రయించడానికి ముందుకు వస్తారు. రైతులకు కూడా లాభం చేకూరుతుంది. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నల్ల గంగాధర్, రైతు, కథలాపూర్

రోడ్లపై విక్రయాలతో ఇబ్బంది



గ్రామాల్లో వారసంతలతో ప్రజలకు మేలు జరుగుతుంది. రైతులకు కూడా విక్రయించడానికి అనువుగా ఉంటుంది. కానీ వారసంత కోసం ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయాలి. గతంలో షెడ్లు ఏర్పాటు చేస్తామని అధికారులు స్థల పరిశీలన చేశారు. ఇప్పటికీ ప్రారంభించలేదు. సంతల్లో నిర్మించే దుకాణాల పనులు త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలి.

– నస్కూరి భాస్కర్, గంభీర్‌పూర్

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని 42వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్రైన్, స్లాబ్, 13వ వార్డులో రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి ఎమ్మెల్యే ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొందరు పక్క నియోజకవర్గ ఎమ్మెల్యేలు జగిత్యాలలో ప్రెస్‌మీట్లు పెట్టి అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పట్టణంలోని ఒక్క వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులు సైతం వారి నియోజకవర్గ మొత్తంలో జరగలేదన్నారు. ఆనాడు ఇందిరానగర్‌లో మాతాత ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గాంధీనగర్, ఇందిరానగర్‌లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించారని, ఇప్పుడు రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జగిత్యాలలో 4500 డబుల్ ఇళ్లు నిర్మించామని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, ఏఈ శరణ్, కౌన్సిలర్లు అసియా సుల్తానా, జియానవీద్, ఇమాంబకర్, సిబ్బంది, నాయకులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ


కార్యకర్తను పరామర్శిస్తున్న కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్ : కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ఏలేటి చంద్రారెడ్డి తండ్రి రాజారాంరెడ్డి అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఆదివారం వారిని పరామర్శించారు. అనంతరం కిషన్‌రావుపేటలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన వివాహ శుభకార్యానికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట ఓరుగంటి రమణారావు, మండల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

బాలికలను అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి


భద్రతా దినోత్సవ వేడుకల్లో చిన్నారులు

జగిత్యాలటౌన్: బాలికలను చిన్నచూపు చూడకుండా అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంపై కూడా ఉందని సీఎస్‌ఐ వెస్లీ చర్చ్ పాస్టర్ జీవరత్నం అన్నారు. అరాధన కార్యక్రమంలో భాగంగా ఆదివారం జగిత్యాల మిషన్ కాంపౌండ్‌లోని ప్రఖ్యాత సీఎస్‌ఐ వెస్లీ చర్చిలో బాలిక భద్రతాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల భవిష్యత్తుకు సమాజం, తల్లిదండ్రుల పాత్రపై జీవరత్నం మాట్లాడుతూ ఆడపిల్లల నేటి సమాజంలో ఆడపిల్లల చూపుతున్న వివక్ష ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆడపిల్లల పట్ల ఉన్న వివక్షను తొలగించేలా తల్లిదండ్రులు, సమాజం వారిని గౌరవించి అన్ని రకాలుగా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సండే స్కూల్ నృత్యాలు, భక్తి గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్రైస్తవులు,చిన్నారులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు విద్యార్థి ఎంపిక

కోరుట్ల: పట్టణంలోని మాస్టో జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బోడ నందిని రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. సంగారెడ్డిలో ఆదివారం జరిగిన పోటీల్లో అండర్ –19 విభాగంలో నందిని ప్రథమ స్థాయిలో నిలిచింది. ఈ సందర్భంగా నందినిని కళాశాల చైర్మన్ ఆకుల రాజేశ్, కోచ్ రమేశ్, అధ్యాపకులు అభినందించారు.

పీఆర్‌బీఎం కళాశాల విద్యార్థి..

పట్టణంలోని పీఆర్‌బీఎం కళాశాల విద్యార్థి మారంపల్లి రోహిత్ తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో అండర్–19 విభాగంలో పాల్గొని పతకం సాధించినట్టు కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అభినందించారు.

యాసంగికి సిద్ధమవుతున్న రైతులు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో ఓ వైపు వానకాలం ధాన్యం కొనుగోళ్లలో రైతులు నిమగ్నం కాగా, మరోవైపు యాసంగిలో వరి సాగు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. యాసంగి కోసం పొలాలను దుక్కి దున్ని చదును చేసి వరి నార్లు సిద్ధం చేశారు.


భూషణరావుపేటలో ఓ రైతు పెంచిన వరి నారు

రేపు గాయత్రి మహా యజ్ఞం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లోని శ్రీ కోందడరామాలయ ఆవరణలో మంగళవారం 24 కుండములతో గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు గాయత్రి పరివార్ కన్వీనర్ వేముల రాంరెడ్డి, కో–కన్వీనర్ కటుకం అమర్‌నాథ్ తెలిపారు. ఈ యజ్ఞం అఖిల విశ్వ గాయత్రీ పరివార్ శాంతికుంజ్–హరిద్వార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఓబన్న విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

మల్లాపూర్: స్వాతంత్ర్య సమర యుద్ధ వీరుడు వడ్డె ఓబన్న అని మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఓడ్డెర కాలనీలో వడ్డె ఓబన్న విగ్రహ ప్రతిష్టాపనకు స్థానిక నాయకులు, ఓడ్డెర సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. వడ్డెర కుల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేసిన వడ్డెర ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ సంగ గంగరాజం, నాయకులు ముద్దం సత్యనారాయణగౌడ్, రవీందర్, మల్లయ్య, పెద్దిరెడ్డి లక్ష్మణ్, ముష్కరి రమేష్, ఓడ్డెర సంక్షే సంఘం మండల అధ్యక్షుడు అల్లేపు నరేష్, సభ్యులు పాల్గొన్నారు.

టాస్కా పోరాట ఫలితంగానే వృద్ధుల సంరక్షణ పాలసీ

జగిత్యాలటౌన్: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ (టాస్కా)పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం వృద్ధుల సంరక్షణ పాలసీని రూపొందించిందని టాస్కా రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో కేంద్రం 'వృద్ధుల సంరక్షణ పాలసీ, సంక్షేమ చట్టానికి సవరణలు' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. 33 జిల్లాల బాధ్యులు చట్టానికి సవరణలు చేయాలంటూ ప్రధానికి పోస్టుకార్డులు పంపినట్లు తెలిపారు. దీని ఫలితంగానే కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం ,ఉపాధ్యక్షుడు పీసీ హన్మంతరెడ్డి, కోశాధికారి వెల్ముల ప్రకాష్‌రావు, సంయుక్త కార్యదర్శి దిండిగాల విఠల్, యాకూబ్ పాల్గొన్నారు.

సర్వే సిబ్బందికి పారితోషికం ప్రకటించాలి

జగిత్యాలటౌన్: ఇంటింటి సర్వే చేస్తు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి ఇచ్చే పారితోషికంపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఎస్టీయూ(స్టేట్ టీచర్స్ యూనియన్)అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. జగిత్యాల పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో బోధనేతర పనులు వినియోగించిన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి ఇచ్చే రెమ్యూనరేషన్‌పై ముందస్తుగా ప్రభుత్వ ఉత్తర్వుల రూపంలో ఆదేశాలు జారీ చేసేవారని తెలిపారు. ఈ సర్వేలో ఎన్యుమరేటర్లను తక్కువగా నియమించి ఎక్కువ కుటుంబాలను కెటాయించడంతో సర్వే సిబ్బంది తీవ్రమైన ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సెలవుల్లో సర్వేలో పాల్గొన్న ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి బండి శ్రీనివాస్, జిల్లా బాధ్యులు మేకల ప్రవీణ్, నరేశ్, మురళి, దశరథ్‌రెడ్డి, కృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామశివారులోని ఊర చెరువు మత్తడి పగుళ్లు చూపి నీటి లీకేజీతో నీరంతా వృథాగా పోతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు చెరువులో పుష్కలంగా నీళ్లు చేరాయన్నారు. మత్తడి లీకేజీతో నీరు బయటకు వెళ్లిపోవడంతో చెరువులో నీళ్లు అడుగంటిపోయే ప్రమాదముందని రైతులు అంటున్నారు. చెరువు సమీపంలోని భూములకు ఏసంగి పంటలకు నీరందక ఎండిపోతాయని రైతులు వాపోతున్నారు. మత్తడిని త్వరగా మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చిరంజీవి, జగిత్యాల బల్దియా కమిషనర్. 9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

హైలెవల్ వంతెనల పనులు పూర్తి చేయాలి


వంతెనను పరిశీలిస్తున్న దావ వసంత

రాయికల్: మండలంలోని మైతాపూర్, రామోజీపేట గ్రామాల్లో చేపట్టిన హైలెవల్ వంతెనల నిర్మాణ పనులను పూర్తి చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. ఆదివారం వంతెనలను ఆమె పరిశీలించి మాట్లాడారు. రెండు చోట్ల వంతెనల నిర్మాణానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.4.35 లక్షలను మంజూరు చేసిందన్నారు. ఈ పనులు పూర్తయితే 30 గ్రామాల ప్రజలకు రాకపోకల విషయంలో ఇబ్బందులు తప్పుతాయన్నారు. కానీ ఇంకా 30 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బర్కం మల్లేశ్, అనిల్, స్పందన, రత్నాకర్‌రావు, శ్రీధర్‌రెడ్డి, గంగారాం, నాగరాజు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామ శివారులో నవదుర్గా పీఠ క్షేత్రంలో ఆలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుమన్ గౌడ్, ప్రతాప్, కస్తూరి శ్రీనివాస్, అనుమల్ల చంద్రం పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు


ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మల్లాపూర్: మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో ఇసుక అక్రమంగా నిల్వ ఉంచిన, రవాణాకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండలంలోని సాతారం శివారులో సీఐ నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సై కిరణ్‌కుమార్, పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకడంపులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామశివారులో కొంతమంది ఇసుక అక్రమంగా నిల్వ ఉంచి లారీలు, టిప్పర్ల ద్వారా నిర్మల్ జిల్లాకు తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులతో దాడులు చేశామన్నారు. పోలీసుల రాకను గమనించిన దుండగులు లారీలు, టిప్పర్లను తీసుకుని పారిపోయారన్నారు. ఇసుక అక్రమ రవాణదారులు నిల్వ ఉంచిన ఇసుకడంపులను స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి రెవెన్యూశాఖకు అప్పగించినట్లు తెలిపారు. అక్రమంగా రవాణా చేస్తే వాల్టా చట్టం ప్రకారం కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎస్సై కిరణ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు కోటేశ్వర్‌రాజు, నర్సింగరావు, కలీం, కానిస్టేబుళ్లు వెంకటేశ్, రత్నాసాగర్, నరేందర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మంచానికే పరిమితమైన గీత కార్మికుడు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగారాం

బుగ్గారం: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుండి పడిపోయి వెన్నుముకకు తీవ్ర గాయాలు కావడంతో ఓ గీతకార్మికుడు మంచానికే పరిమితమయ్యాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉండి చికిత్స పొందుతున్నాడు. బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన పాకాల గంగారాం వారం రోజుల క్రితం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. వెంటనే గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు వెన్నుముకకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. ప్రస్తుతం జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. పూర్తిగా మంచానికే పరిమితమయ్యే పరిస్థితి ఉండడంతో ఉపాధికి దూరమయ్యే దుస్థితి ఏర్పడింది.బాధితుడికి భార్య పుష్పలత,ముగ్గురుకుమారులు,ఒక కుమార్తె ఉన్నారు. ప్రభుత్వం దయతలచి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు గంగారాం వేడుకుంటున్నాడు.

మున్నూరుకాపు సంఘ యూత్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రమేశ్


నియామకపత్రం అందిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్

వెల్గటూర్ : మున్నూరుకాపు సంఘం జగిత్యాల జిల్లా యూత్ ఉపాధ్యక్షుడిగా మండలంలోని కిషన్‌రావుపేటకు చెందిన పూదరి రమేశ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ హబ్సీగూడ లోని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యాలయంలో రమేశ్‌కు సంజీవ్ నియామకపత్రం అందించారు. తన నియమకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీశ్, నాయకులకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎర్ర సంజీవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.